# ఆమె మనసు

## వీరభద్రరావు పమ్మి

ఆమె పెన్ను, కాగితం తీసుకుంది. జ్ఞాపకం పెట్టుకోవలసిన విషయాలన్నీ రాయడం మొదలెట్టింది.

షాంపూ చేసుకోవాలి ...
గోరింటాకు పెట్టుకోవాలి ...
రెండు చేతులకి చప్పుడయ్యే గాజులు వేసుకోవాలి.
కాళ్ళకి గజ్జెలు పెట్టుకోవాలి.
పరుపు మీద దుప్పటి పరవాలి.
'తెల్లచీర' కట్టుకోవాలి
ఫ్లాస్కు నిండా పాలు పోయాలి.
టీపాయి మీద పళ్ళు, స్వీట్లు వుంచాలి.
పక్క నిండా మల్లెపూలు చల్లాలి.
తల్లో మల్లెపూలు పెట్టుకోవాలి.
ఎర్రటి తిలకం బొట్టు పెద్దది పెట్టుకోవాలి.
అగరువత్తులు వెలిగించాలి.
పడక గది గుమ్మానికి మల్లెదండలు కట్టాలి.
పడక గదిలో నేల మీద అతని పేరు మల్లెపూలతో అమర్చాలి ...

రాయడం ఆపి - ఒక్క క్షణం ఆలోచించింది.

''నేనేమన్నా పిచ్చిగా ఆలోచిస్తున్నానా?' అనుకుంది.

'ఏం కాదు - అనుకున్నట్టుగా చెయ్యాల్సిందే - జీవితంలో ఒక్కసారి ఒకే ఒక్కసారి-

ఏమో ఈ అవకాశం మళ్ళీ వస్తుందో రాదో?' అనుకుంది.

కాలెండర్ కేసి చూసింది.

అతను రావడానికి ఇంకా మూడు రోజులు పడుతుంది.

వచ్చాక ఏడు రోజులుంటాడు. ఏడు రాత్రిళ్ళు, ఏడు పగళ్ళు...

ఆ ఏడు రోజులూ-

పగలే వెన్నెలా - జగమే ఊయల.

ఆఫీసులో ఓ కొంటె వెధవ 'అడవిని గాచిన వెన్నెల గాకే' అని దూరంగా పాడుతున్నాడు ఓ రోజు.

అతను వచ్చి ఏడు రోజులూ వుండి వెళ్ళాక 'అడవిని గాచిన వెన్నెల కాలేదురా వెర్రి వెధవా' అని చెప్తే అనిపించింది. నిజంగానే - వాడలా పాడిన రోజున ఇంటి కొచ్చి నిలువు టద్దం ముందు నిలబడి తనని తాను పరికించి, పరీక్షించి చూసుకుంది.

నిజమే!

నడుం దగ్గర స్పాంజి ముక్కలు అతికినట్టుగా ఫ్లెష్ చేళ్ళాడుతోంది. జబ్బలు లావెక్కి మోటుగా అయ్యాయి. దవడలు కూడా సాగదీసినట్టుగా అవుతున్నాయి. గెడ్డం కింద సెకండ్ చిన్ ఏర్పడుతోంది. కళ్ళ చుట్టూ నల్లటి సర్కిల్స్ ఏర్పడి - అసలే పసస తొన రంగు శరీరమేమో - స్పష్టంగా తెలుస్తున్నాయి. జుట్టు మెల్లి మెల్లిగా రాల్తోంది. చెంపల దగ్గర నాల్గైదు వెంట్రుకలు వెండి రంగులో...

ఇవన్నీ ఒక్క విషయాన్ని, ఒకే ఒక్క విషయాన్ని సూచిస్తున్నాయి. ఏజ్ ... వయసు ...

వయసు ఎంత చెడ్డది.

అల్లరి చేస్తుంది. బాధ్యతా రాహిత్యాన్ని నేర్పుతుంది. ఎడ్వెంచర్ని, లెక్క చెయ్యని తనాన్ని, అందాన్ని, సొగసుని, సోయగాన్ని ......

చివర్నే భయాన్ని!

వయసు చెడ్డది - అన్ని రకాలుగా, అన్ని వేళల్లో, వాడన్నాడని బాధ ఎలా వున్నా - తనేం చిన్న పిల్ల కాదు. రేపు డిసెంబరుకి ముప్పై ఎనిమిది వెడతాయి...

'ఇంకా అనాఘ్రాత పుష్పమేనంటావా?' అని కొందరనుకోవడం ఆమె చెవిన పడకపోలేదు. ఆ మాట జ్ఞాపకం వచ్చి ఆమె నవ్వుకుంది.

తే- మరో మూడు రోజుల పాటు అనాఘ్రాత పుష్పాన్నే ... అని కూడా అనుకుంది.

''నేను చెడి పోతున్నానా?'' అన్న ఆలోచన ఆమెకి రాకపోలేదు. ఆ ఆలోచన మళ్ళీ మళ్ళీ రాకుండా నొక్కి పెట్టేసింది. తొక్కి పెట్టేసింది. తల్లి చనిపోయేనాటికి ఆమెకి ఉద్యోగం వుంది. అంతేకాకుండా పెళ్ళి కాని ఒక అక్క, చదువుకుంటున్న ఇద్దరు తమ్ముళ్ళు కూడా వున్నారు. వాళ్ళందరి బాధ్యతా వుంది.

అంతే కాదు - కొంచెం అప్పు కూడా వుంది.

తండ్రి అంతకు ముందు చాలా సంవత్సరాల క్రితమే తాగి, తాగి; తాగి, తాగుతూ చనిపోయాడు. ఆమె తల్లి భర్త పోయాక పిల్లలకి 'నీవే తల్లియు, తండ్రియు, నీవే గురుడవు దైవము, నీవే తోడు నీడ అయి పిల్లల్ని సాకింది. పిల్లల్ని సాకడానికి ఆమె కష్టాలే పడింది.

పెద్ద పిల్లకి పుట్టుకతోనే కాలు అవకరం వుంది. బుర్ర కూడా అంతంత మాత్రమే. ఆ పిల్లకి చదువు అబ్బలేదు. ఆమె మాత్రం (రెండవ పిల్ల) అందంగాను, చలాకీ గాను, తెలివిగాను వుండేది. అంచేత తల్లి తన ఆశలన్నీ సహజంగా ఆమె మీద పెట్టుకుంది.

ఆమె చదువుకుంది.

బాగా చదువుకుంది.

ఉద్యోగం కూడా వచ్చింది.

ఆమెకి ఉద్యోగం వచ్చాక ఆ కుటుంబపు కష్టాలు ఓ దారిన పడ్డాయి. ఓ పక్క ఇంటిని పోషిస్తూ, మరో పక్క తమ్ముళ్ళని చదివించింది. తమ్ముళ్ళకి ఉద్యోగాలు వచ్చాయి. అంతా బాగానే వుంది.

కాని - అక్కగారి పెళ్ళి సమస్య అలానే వుండిపోయింది. ఆమెకి చదువు లేదు. ఉద్యోగం లేదు. పైగా అవకరం మనిషి-

అవకరం మనిషిని చేసుకుంటానని ఏ విశాల హృదయమూ ముందుకి రాలేదు. పోనీ మరో పదివేలో, ఇరవై వేలో పోసి ఎవణ్నో ఒకణ్ని కొని పడేద్దామంటే అంత డబ్బూ లేదు.

ఏ రకంగా ఆలోచించినా ఆమె పెళ్ళి సమస్యకి పరిష్కారం దొరకలేదు. ఈలోగా తల్లి చనిపోయింది.

అక్క పెళ్ళి కాలేదు - ఇంకెలాగూ కాదు. పోనీ 'నేను చేసేసుకోనా?' అని ఆమె ఆలోచించక పోలేదు. మరి తను పెళ్ళి చేసేసుకుని తను మొగుడితోను, పిల్లా పాపలతోను హాయిగా వుండిపోతే అక్క ఏమైపోతుంది?' అన్న ప్రశ్న ఎదురుగా నిటారుగా నిలబడింది. అక్కడ తనతో వుండడానికి తన భర్త - ఇష్టపడొచ్చు. పడకపోవచ్చు. ఒకవేళ ఇష్టపడినా పెళ్ళికాని అక్క హాల్లో పడుకుంటే తను ఏం మొహం పెట్టుకుని పడకగది తలుపులు వేసుకోగలదు?

పోనీ అక్క తమ్ముళ్ళ దగ్గర వుండొచ్చు కదా - అన్న ఆలోచన ఆమెకి ఎప్పుడూ రాలేదు. ఎందుకంటే తమ్ముళ్ళు అంత బుద్ధిమంతులు కారు. ఉద్యోగం వచ్చినప్పట్నుంచి పేయింగ్ గెస్టు పద్ధతిలో ఆమెకి చెరో రెండు వందలు ఇస్తున్నారు. అలాంటి స్వార్థపరులు పెళ్ళిళ్ళు చేసుకుని మరింత స్వార్థపరులై, పిల్లల్ని కని ఇంకాస్త స్వార్థపరులై - స్వార్థమే ఊపిరిగా, స్వార్థమే ప్రాణంగా, స్వార్థమే జీవితంగా బతికే ఆ స్వార్థపు తమ్ముళ్ళు అక్కను చూడరుగాక - చూడరు.

అక్క - అంతే అక్కకి నేను, నాకు 'ఇంకెవ్వరూ లేరు' అనుకుంది ఆమె.

పెళ్ళి చేసుకోనా - వద్దా?
చేసుకోనా - వద్దా?
చేసు ... వ ...

ఇలాగే చాలా కాలం గడిచిపోయింది. పెళ్ళి కాలేదు గాని - వయసు దాటిపోయింది.

తర్వాతర్వాత ఆ ప్రశ్నని మనసులోంచి తుడిచేసింది. అక్కలిద్దరికీ పెళ్ళిళ్ళు కాలేదని తమ్ముళ్ళిద్దరూ పెళ్ళిళ్ళు మానలేదు.

'ఎవరికి ఏం రాసి పెట్టివుందో ఎవరికి తెలుసు?' అన్న పచ్చి హైందవ వేదాంతాన్ని నమ్మారు.

ముందు పెద్దాడు, తర్వాత చిన్నాడు పెళ్ళిళ్ళు చేసేసుకున్నారు. కొత్త పెళ్ళాలతో, కొత్త కాపురాల్లో, కొత్త

ముద్దులు, కొత్త మురిపాలు తీరకుండా ఈ అక్కలిద్దరూ అడ్డం వస్తారని వాళ్ళకి గట్టిగా అనిపించింది.


అందుకని ఇద్దరూ వేరో ఊరు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని ఆకాశంలో ఎగిరే ప్రేమ పక్షుల్లా ఎగిరిపోయారు. అయినా ఆమె బాధ పడలేదు.

వాళ్ళు పెళ్ళిళ్ళు చేసేసుకున్నారనిగాని, మరో ఊరు ట్రాన్స్‌ఫర్ చేయించేసుకుని వెళ్ళిపోయారని గాని - దేనికీ ఆమె బాధ పళ్ళేదు.

ఎవరికి ఏం రాసి పెట్టి వుందో ఎవరికి తెలుసు? అని ఆమె కూడా అనుకుంది.

తమ్ముళ్ళిద్దరూ వాళ్ళ తోవ వాళ్ళు మాసుకుని వెళ్ళిపోతే ఆమె అక్కగారు మాత్రం బాధ పడింది.

"చదివించావ్ - పెంచి పెద్ద వాళ్ళని చేశావు - వెధవలకి కృతజ్ఞత లేదు. వాళ్ళ దారిన వాళ్ళు



వెళ్ళిపోయారు" అని అక్కగారు బాధపడింది.

ఆమె నవ్వింది.


నిర్వేదంగా నవ్వింది.

"పిచ్చి అక్కా - ఎంత వెర్రిదానివే - రెక్కలొచ్చిన బిడ్డలు తలిదండ్రుల దగ్గరే వుండరు. ఆఫ్టరాల్ మనం అక్కలం మన దగ్గర ఎందుకుంటారే? వాళ్ళ సుఖం వాళ్ళకి ముఖ్యం. ఒకళ్ళ కోసం వాళ్ళ సుఖాలు వీదులుకోవాలని మనం అనుకో కూడదు" అంది.

అక్కగారు కోపంగా ఆమె కేసి మాసింది.

"మరి - మరైతే నా కోసం నువ్వు పెళ్ళి పెటాకులు మానేసి ఎందుకిలా వుండిపోయావ్?" అనడిగింది.

"ఓ- అదా- నేను నా దారి మాసుకుని వెళ్ళిపోతే నువ్వు ఇబ్బంది పడిపోతావ్- నిన్నెవరు మాస్తారు? తమ్ముళ్ళిద్దరూ వెళ్ళిపోయినా మనకి ఇబ్బంది లేదు. మనకి గడవదన్న బాధ



శ్రీ బలివాడ కాంతారావుకు ఇటీవల హైదరాబాద్ త్యాగరాయ గానసభలో యువ కళావాహిని గోపీచంద్ అవార్డు ప్రదానం చేస్తున్న శ్రీ కోట పున్నయ్య. వేదికపై శ్రీ సాయిచంద్ ప్రభృతులను చూడవచ్చు.

లేదు. నీకు నేను, నాకు నువ్వు తోడున్నాం'' అని ఆమె నవ్వేసింది.

అలా నవ్వేసిందే గాని- 'ఓరి దుర్మార్గపు మానవుడా! ఈ డబ్బు అనేదాన్ని కనిపెట్టి ఎంత దారుణం చేశావురా! ఎన్ని జీవితాల్ని నాశనం చేశావురా! పుట్టగానే పిల్లలకి పట్టే ఆముదం దగ్గర్నుంచి చచ్చేక కాల్చడానికి పోసే కిరసనాయిల్ దాకా అడుగడుగునా, క్షణక్షణం డబ్బుతో లంకె పెట్టేసి- మానవుడి జీవితాన్ని ఎంత విషప్రాయమూ, ఎంత నరకప్రాయమూ చేసేవురా?' అన్న ఆలోచన ఆమె మనసులో వళ్ళచక్రంలా గిరగిరా తిరిగింది.

లోకం సాగిపోతోంది.

ఆమె జీవితమూ సాగిపోతోంది.

తమ్ముళ్ళకి పిల్లలు కలిగారు. వాళ్ళు పెరిగి పెద్దవాళ్ళవుతున్నారు. తనకీ ఆ రోజు కారోజు వయసు వస్తోంది.

ఆమె అక్క మెల్లిమెల్లిగా భక్తిలో పడింది. అందుకు ఆమె సంతోషించింది కూడా!

'కనీసం నాకు ఉద్యోగం వల్ల ఓ వ్యాపకం వుంది. పగలంతా ఆ హడావుడిగా, ఆఫీసులో స్నేహితులతో గడిచిపోతోంది. ఇంటిదగ్గర కాలక్షేపానికి పుస్తకాలున్నాయి. ఎప్పటికీ నిజం కాని కలలున్నాయి. పాపం అక్కకి ఏవీ లేవు. కనీసం ఆ భక్తిలో పడితే మనసుకి కొంత స్వాంతన కలుగుతుంది' అనుకుంది.

ఆమె అక్క ఓ అమ్మగారి భక్తబృందంలో చేరింది. రోజూ సాయంత్రాలు ఏవో ఉపన్యాసాలు, భజనలు... వాటికి వెడుతూంటుంది.

రానురాను పూర్తిగా అదే ధ్యాసలో పడిపోయింది. మరి కొన్నాళ్ళు పోయాక "అమ్మగారు అదేదో ఊళ్ళో ఆశ్రమం కడుతున్నారు. ఏ దిక్కూ లేని నాలాంటివాళ్ళని అక్కడ వుండనిస్తారట- మనం డబ్బేమీ కట్టక్కర్లేదు. గేదెల్ని మేపి పాలు అమ్మి, కూరగాయలు అవీ కాయించి, అవి అమ్మి- ఆశ్రమం నడుపుతారట. నేను ఆశ్రమంలో చేరదామనుకుంటున్నాను'' అంది.

అక్క మాటలు విన్న ఆమె బిత్తరపోయింది. ఆమె కళ్ళలో నీళ్ళు, గుండెల్లో బాధ ఒకేసారి తిరిగాయి.

"అదేమిటక్కా! నువ్వు దిక్కులేనిదాని వెందుకవుతావు? నీకు నేనున్నాను. జీవితాంతం నిన్ను నేను చూసుకుంటాను. నువ్వు ఎక్కడికీ వెళ్ళక్కర్లేదు. నిన్నలా ఆశ్రమానికి పంపేస్తే చచ్చిపోయిన అమ్మ నన్ను క్షమిస్తుందా? అసల్నేను పెళ్ళి చేసుకోకుండా ఇలా వుండిపోయింది నీ కోసమే కదా- ఒద్దక్కా, నన్ను వదిలేసి- నన్ను ఒంటరిగా వదిలేసి నువ్వు వెళ్ళొద్దు- ఏ ఆశ్రమానికీ వెళ్ళొద్దు'' అని ఆమెను బతిమాలింది. అక్కని గట్టిగా పట్టుకుని ఘొల్లుమని ఏడ్చింది.

"ఛీ, ఏడవకు వెర్రిదానా! ఈ ప్రపంచం ఎంతో గొప్పదే. నాలాంటివాళ్ళ కోసం ఆశ్రమాలున్నాయి. నీలాంటివాళ్ళ కోసం ఉద్యోగాలున్నాయి. ఏ వ్యాపకమూ లేకపోతే మనుషులు చచ్చిపోతారు.

అంచేత నువ్వేమీ బాధపడకు- నిన్ను నువ్వు జాగ్రత్తగా చూసుకో- నన్ను ఆశ్రమంలో అమ్మగారు జాగ్రత్తగా చూసుకుంటుంది. ఈ ప్రపంచంలో ఎవరికి ఏం రాసిపెట్టి వుందో ఎవరికి తెలుసు?'' అంది.

ఆమె ఎంత చెప్పినా అక్క వినిపించుకోలేదు. తన బట్టలు తీసుకుని ఆశ్రమానికి వెళ్ళిపోయింది.

మొదట్లో ఆమె ఒంటరితనంతో చాలా బాధపడింది. ముఖ్యంగా అక్క ఆశ్రమంలో ఏం ఇబ్బంది పడుతుందోననే బాధ కూడా వుంది.

కష్టాలు పెట్టిన భగవంతుడే వాటిని తట్టుకునే శక్తిని కూడా ఇస్తాడు అనుకుంది.

ఓసారి ఆశ్రమానికి వెళ్ళి అక్కగార్ని చూసి వచ్చింది. అక్కగారు సుఖంగా, ఆనందంగా, హాయిగా వుందని తెలిసి ఆమె చాలా సంతోషపడింది కూడా.

ఆఫీసులో అప్పు తీసుకుని ఓ చిన్న ఫ్లాట్ కొనుక్కుంది. ఇంట్లోకి కావలసిన సామానంతా కొనుక్కుంది. మంచాలు, పరుపులు, ఎయిర్ కూలర్......

తనిప్పుడు ఒంటరిది...

పోనీ ఇప్పుడు పెళ్ళి చేసుకుంటే- అన్న ఆలోచన కలిగింది. తనకిప్పుడు ముప్పై ఎనిమిదేళ్ళు. కనీసం నలభై ఏళ్ళవాడు కావాలి. నలభై ఏళ్ళవాడు పెళ్ళి చేసుకోకుండా ఎందుకుంటాడు?

మరీ ప్రయత్నిస్తే రెండో పెళ్ళివాడు దొరుకుతాడు. రెండో పెళ్ళివాడికి రెండో పెళ్ళాంగా, సవతి పిల్లల్ని సాకుతూ బతకడం ఆమె కిష్టం లేదు...

ఇప్పుడు తనకి అన్నీ వున్నాయి.

ఇల్లు వుంది, ఇంటినిండా సామాను వుంది. మంచి ఉద్యోగం వుంది. బాధ్యతలు, బంధాలు లేవు-

కాని పెళ్ళి కాలేదు.

పూర్వం ఆమెను దాంపత్యపు సుఖాలు పెద్దగా బాధపెట్టేవి కావు కాని ఇప్పుడు-

ఈ ఒంటరితనాన్ని ఆసరాగా తీసుకుని... కోరికలు పాములై మనసులో తిరుగుతున్నాయి. ఎంత నిలదొక్కుకున్నా మనసు నిలవడం లేదు. తప్పు చెయ్యకూడదన్న భావన ఒకపక్క- తప్పు చేస్తూ దొరికిపోతే సంఘంలో పరువు పోతుందన్న భావన ఒకపక్క-

చాలా పగళ్ళు, రాత్రుళ్ళు ఆలోచించింది. ఆఖరికి-

అది తప్పో, ఒప్పో-

అది నీతో, అవినీతో-

అది పాపమో, పుణ్యమో-

దాంపత్య సౌఖ్యం అనుభవించాలని నిర్ణయించుకుంది. ఆ నిర్ణయం తీసుకున్నప్పుడు ఆమెకి అతనే జ్ఞాపకం వచ్చాడు.

అతను పూర్వం ఆమెతో కలిసి పనిచేశాడు. ఆమె మీద ఇష్టం కూడా పెంచుకున్నాడు. పెళ్ళి చేసుకుంటానని కూడా అన్నాడు.

కాని ఆమె చేసుకోను గాక చేసుకోను అందని వేరే అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. తర్వాత బొంబాయిలో మరో ఉద్యోగం వస్తే వెళ్ళిపోయాడు.

ఆమె అతనికి ఉత్తరం రాసింది. తన మనసులో ఆలోచనల్ని స్పష్టం చేస్తూ "నువ్వొక వారం రోజులుండేట్టు రా- పగలుకీ, రాత్రికీ తేడా తెలియకుండా ప్రేమపక్షుల్లా నా గూట్లో గడుపుదాం. ఎప్పుడొస్తావో తెలియజెయ్యి. వస్తానన్న రోజుకి పిడుగులు పడ్డా సరే- రావాలి! ఇన్నాళ్ళికి నా సుఖం కోసం ఓ నిర్ణయం తీసుకున్నాను. నన్ను నిరాశపరచకు'' అని రాసింది.

అతను వెంటనే "ఏడో తేదీ రాత్రికి అక్కడికి వస్తాను. వారం రోజులూ ఇంట్లోంచి అడుగు బైట పెట్టకుండా నీతోనే వుంటాను'' అని జవాబు రాశాడు.

తనకెలాగూ పెళ్ళి కాలేదు. శోభనమూ కాలేదు. అతను వచ్చే రోజుని మొదటి రాత్రిలా అనుభవించాలని ఆమె ఆశ.

ఆ రాత్రిని ఎప్పటికీ మరిచిపోలేని మధురానుభూతిగా, తీయటి అనుభవంగా దాచుకోవాలని ఆమె తాపత్రయం.

వారం రోజులు శెలవు పెట్టింది. తెలిసున్నవాళ్ళందరికీ తను ఊరెడుతున్నానని చెప్పింది. అన్ని జాగ్రత్తలు తీసుకుంది.

ఏడో తేదీ ఉదయం హాల్లో కూర్చుని అతని గురించే ఆలోచిస్తోంది. 'చెయ్యాల్సిన పనులు చాలా వున్నాయి. త్వరగా తెమలాలి' అనుకుంది.

తలుపు చప్పుడైంది- వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా పెద్ద తమ్ముడు-

"అనుకోకుండా నాకీ ఊరికి ట్రాన్స్ఫరైంది. నీకు తెలియజేసే టైం కూడా లేదు. మా ఆవిడని, పిల్లల్ని తీసుకుని వచ్చేశాను. సామాను సాయంత్రం వస్తుంది'' -వెనకాలే అతని పెళ్ళాం, పిల్లలు వచ్చారు.

ఓ అరగంట తర్వాత ఆమె బాత్రూంలోకి వెళ్ళి తలుపు వేసుకుని కుళాయి తిప్పి రెండు చేతుల్లో ముఖం దాచుకుని ఘొల్లున ఏడ్చింది.

'నా ఇంట్లో నేను సుఖపడే యోగం ఎలాగూ లేదు. కనీసం దుఃఖపడే అదృష్టం కూడా లేదు' అనుకుంది.

ఆమె మనసు జీవితపు వళ్ళచక్రాల మధ్య ఇరుక్కున్నట్టుగా నలిగిపోతోంది. ✦